# మజ్జిగపులుసు ::

రచన: శ్రీ కాంచనపల్లి వేంకటరంగారావు

(తానున్న అద్దె కొంపలోని వాకిటివరండాలో భర్త-పెరటివరండాలో భార్యా. సాయంత్రం అయిదుగంటల సమయం అత్యవసరమైన పనుండి భార్యను యిట్లా పిలుస్తాడు)

భర్త: ఒసేయ్!

భార్య: .........

భర్త: ఏమేవ్!!

భార్య: .........

భర్త: అమ్మీ!!!

భార్య: .........

భర్త: పలకవేమేం?

భార్య: ఇట్లాపిలుస్తే నేను పలకనండి.

భర్త: ఓహో పిలుపుకి కూడా పీకులాటవచ్చిందే.

భార్య: ఒక్క పిలుపుకే కాదు. పీకులాటవచ్చేటట్లు పిలుస్తే అన్నిటికీ పీకులాటే అనుకోండి.

భర్త: అనుకోవాలా? అయితే అనుకుంటానులే. గాని.........

భార్య: ఏంగాని అనేసి మిగతాదంతా మింగేశారేం?

భర్త: మింగడానికేంగాని, నిన్ను ఎట్లాపిలుస్తే పలుకుతావా అనే ఆలోచనలో పడ్డానే.

భార్య: బాగాపడ్డారా? అయితే ఎట్లా పిలవడమో చెపుతాను వినండి. మా అమ్మ- నాన్న నాకు ఎంతో ఖర్చుచేసి భారసాలనాడు ఏపేరు పెట్టారో ఆపేరుతో పిలవండి.

భర్త: అబ్బో. చాలా గొప్ప కోరికేవుందే. అది తీరడం మాత్రం చాలాకష్టం సుమా. ఎందుచేత నంటావా మా అమ్మపేరు, నీపేరు ఒకటే అవుతోంది.

భార్య: అట్లాగని అమ్మీ, నిమ్మీ, అని పిలుస్తారా?

భర్త: అమ్మీ అని పిలవడం నీకు యిష్టం లేకపోతే అప్పుడప్పుడు మానేస్తూ వుంటాను గాని, యిప్పుడు నీవు చెప్పిన ఆరెండోపేరు నిజంగా అమృతం లాగుంది సుమా! సినిమాష్టారు ఒకర్తెవుందిలే నిమ్మీ అనేపేరుతో నాకు సినీమాష్టారుల పేర్లంటే ఎంతో యిష్టం కూడాను. అందుచేత యివాల్టినుంచి, అంటే యీక్షణంనుంచే ఆ మొదటిరాత్రి నేను ఎంతో కష్టపడి సెలక్టుచేసి, బోణీ చేసిన ఆ అమ్మీ అనే పేర్న నట్టేసి, నిమ్మీ అని తగిలించేస్తాను. ఆతగిలింపుతో నిజంగా నాకు నిమ్మీ భార్య అయినట్లుగా వుంటుంది. ఏంబాగుందా?

భార్య:- ఎందుకు బాగుండదు? మీసరదా తీరినట్లు వుంటుంది. నాపేరు మారినట్లువుంటుంది. అమ్మీ అని పిలవడం పోయినట్లూ వుంటుంది. నిమ్మీ మీ భార్య అయినట్లు వుంటుంది.

భర్త:- ఆ సినీ తస్సాదియ్యా నిమ్మీ పేరు నీకు తగిలించగానే ఎంత కవిత్వం పూరించే యిప్పటికిప్పుడు. నాలుగు అట్లు ఒక్కమారుగా లాగి పారేశావే. చూశావా, ఒక్క పేరు మార్పుతో ఎన్ని అట్లు నీనోటి వెంట వచ్చాయో!

భార్య:- వస్తాయి, వస్తాయి.

భర్త:- ఏం అట్లా తటాయిస్తున్నావు నిమ్మీలాగ?

భార్య:-తటాయించడం కాకపోతే ఏమిటిచెప్పండి. ప్రతి పండుగకు ఏదో కారణం చెప్పి ఎగవేస్తున్నారు.

భర్త:- ఈమాటు అట్లా వుండదులే.

భార్య:- అయితే యిదివరకల్లా కారణం చెప్పి ఎగవేశారు. ఇప్పుడు కారణం చెప్పకుండానే ఎగవేస్తారన్నమాట.

భర్త:- అన్నమాట, తమ్ముడు మాట నాకు తెలియదు. ఈపండుక్కి నీవు అడిగినా అడక్కపోయినా, కట్టుకున్నా కట్టుకోకపోయినా ఫస్టుక్లాసు గోంగూర పులుసు జార్జెట్ చీర, ఒకటోరకం వాయిల్ టమాటో జాకెట్ గుడ్డ తెస్తాను. ఈటమాటో వాయిల్ జాకెట్ తొడుక్కుని, ఆ గోంగూరపులుసు జార్జెట్ చీర కట్టుకుంటే నీవు నిజంగా నిమ్మీలాగే వుంటావు సుమా!

భార్య:- అప్పుడు మీరెట్లా వుంటారో సుమండీ!

బలే పెంకిదానిలాగున్నావే. నీ పేరు కాకపోతే ఎందుకు పలికావు ?

చిన్నీ అనేపేరు నా చెవికెంతో హాయిగా వుంది బాబూ. మూడేళ్ల క్రింద ముక్కలైపోయిన అతగాడు జ్ఞాపకానికొస్తూన్నాడు.

ఎంత ముద్దుగా చెప్పావే చిలకా అతగాని చావు. పోనీ యిదీ ఒక మంచికే వచ్చింది. రోజూవచ్చి చని పోయిన అతగాడ్ని జ్ఞాపకం చేస్తూవుంటాను లే. చిన్నీ!

ఏం బాబు.

Mixture ముక్కలు అర్జంటుగా కావాలి. వున్నాయా ?

నాకేటో బోధపడలేదు బాబు.

ఈ మాత్రం యింగ్లీషు రాకుండా కూరల దుకాణంలో కూర్చోడం నాకేం నచ్చలేదు. అధమం మూడుసార్లు దండయాత్ర కొట్టైనా ఆసూ్కలు పైనల్ కాస్త ప్యాసై పోతే నీకేబాధలేకపోయేదిగదా ! Mixture అంటే అన్నిరకాలు అన్నమాట.

ఎందుకు బాబు ? రేపు మీ యింట్లో ఏదైనా దప్పళం వుండేటి బాబు.

రేపేగాదు మా యింట్లో రోజూ అలావుంటుంది. గుమ్మిడికాయి, పనసకాయి, దోసకాయి, వంకాయి, ఆనపకాయి అన్ని రకాలువున్నాయి బాబు. అన్నిట్లోను ఒక్కొక్క అర్ధరూపాయి చొప్పున యిచ్చేదా బాబు?

రకానికి పావలా చొప్పున యిద్దూ. నేను మాత్రం ఎంచను. ఏరను. నీ చేత్తో నివ్వే ఎంచి మా నిమ్మీచేత ఆ తిట్లు నీవేతిను.

మీకేం భయంలేదు బాబూ. సంచీపట్టండి వంకాయి, బెండకాయి మాత్రం వద్దుసుమా !

అన్నింట్లోను రెండేసి ఎక్కువ కూడా వేశాను. నాకొ్కంచెం పులుసు యిప్పించాలిసుమండి రేపు. సరేలే. ఆ సంగతి మానిమ్మికి చెపుతా. అంటూ ఆ సంచీకాస్తా ఒక రిక్షాలో పడేసి అందులో కూర్చుని యింటికి పోయాడు.

* * * *

(హాల్లో జడ సవరించుకుంటూ నిమ్మీ నిలబడి వుంటుంది. భర్తకూరల సంచీతో దిగబడుతాడు.)

భర్త :- హలో నిమ్మీ !

భార్య :- ఎదురుగుండా కనిపిస్తూవుంటే ఎక్కడి టెలిఫోనులో మాట్లాడుతున్నట్లు హలో, హలో, ఎందుకండి ? ఇవన్నీ పులుసులోకి ముక్కలే. ఒక్కమాటు యిన్ని తెచ్చుకుంటే వాడితగలడి పోవుటండి ?

భర్త :- లేతగావున్నాయిగదా, నీ వెంతో సరదా పడతావని తెచ్చాను.

భార్య :- పులుసు సరదా మీకా, నాకా ?

భర్త :- మనిద్దరికీ అనుకో. చేసిన తర్వాత నే నొక్కడ్నే త్రాగేస్తున్నానా ఏమిటి ?

భార్య :- అరకం కాదని నాకు తెలుసుగాని, మన యిస్తోకుకోసం రెండు రూపాయిల కూరలు ఎందుకండి?

భర్త :- రెండు రోజులై మబ్బుగావుంది. విడవకుండా వర్షాలుగాని పట్టుకుంటే కూరలు దొరకడం చాలాకష్టం. నేను బాగా ఆలోచించే అన్నిరకాలు ఒక్కమాటే తెచ్చాను. ఏదున్నా లేకపోయినా వంట యింట్లో నిండుగా ముక్కలు వుండాలే. రేపు యీ ముక్కలన్నీ వేసి ఫస్టుగా మజ్జిగపులుసు చేయి చూద్దాం.

భార్య :- చూడ్డానికేముంది. ఇప్పటికి అంటే యీ పదినెలల్లో అధమం ఒక 50 సార్లైనా చేసి వుంటాను.

భర్త :- అయితే యిది ఏభై ఒకటో దన్నమాట.

భార్య :- డైరీలో నోట్ చేసుకోండి మరిచి పోతారు.

భర్త :- కొనకుండా నాకు ఒక డైరీ దొరికింది. అది నీ కిచ్చేస్తాను. వంటింట్లో వుంచుకొని మనిద్దరికే మజ్జిగ పులుసు సందర్భంలో ఏరోజు ఎట్లాగడుస్తుందో ఆ విషయాలన్నీ మజాగా వ్రాస్తూవుండు. నీకు డైరీ వ్రాయడం కూడా తెలుస్తుంది.

భార్య :- ఇంతకంటె మంచి విషయాలు మనకేం వున్నాయి డైరీలో వ్రాసుకోడానికి ! ఆపని మీరే చేసుకుంటూ వుండండి. కావాలిస్తే నేను జ్ఞాపకం చేస్తూ వుంటాను.

భర్త :- అయితే రేపు ఏదైనా ఒకటోదఫాగా మజ్జిగ పులుసు ఒకటో రకంగా చేస్తావన్నమాట చేసిపారెయ్ త్రాగేసి పారేద్దాం.

భార్య :- ఓహోహో ఏంత్యాగం చేస్తున్నారండీ. ఇట్లాంటి మీకు నిజంగా ఎవరైనా ఒక మెడల్ యిస్తే బాగుండును.

భర్త :- ఎవరో ఎందుకు? ప్రెజంటెడ్ బై నిమ్మి అనేపేరుతో నీవే ఒకటి తగిలిద్దూ. మా ఆఫీసులో వెధవలంతా నిజంగా సినిమాష్టారు నిమ్మి నాకు ఒక ప్రత్యేక సందర్భంలో మెడల్ యిచ్చినట్లు చూచి గుమ్మైపోతారు. నా సరదా తీరిపోయిన తర్వాత దానిమీదే నేను నీకు ప్రెజంట్ చేసినట్లుగా మజ్జిగ పులుసు చెయ్యడంలో expert అని అక్షరాలు చెక్కించి తగిలించేస్తాను. ఆ దెబ్బతో మజ్జిగపులుసు త్రాగడంలో expert నేను, చెయ్యడంలో expert నీవు అయినట్లు, మనిద్దరికి మెడల్సు దొరికినట్లు మన యిరుగు పొరుగుకి, మా ఆఫీసులో అందరికే తెలిసి పోతుంది. మన గౌరవార్థం అందరూ టీ పార్టీలే. ప్రతి పత్రికలోను మన ఫొటోలే. నీ పేరు నిమ్మి అని పెట్టడం కాదుగాని నాక్కూడా మంచి పబ్లిసిటీ వచ్చేస్తోందే.

భార్య :- వస్తుంది. వస్తుంది.

భర్త :- వస్తుంది అంటే జ్ఞాపకం వచ్చింది. ఈ కూరలు అమ్మిన చిన్ని రేపు పులుసుకు వస్తానంది. దానికెంతో యీ పులుసంటే యిష్టమట. మరొక తవ్వెడు నీళ్లు ఎక్కువ తగిలించు.

భార్య :- పులుసు కాచే పెళ్లాం పేరు నిమ్మి. పులుసులోకి ముక్కలు పేరు చిన్ని, మరోదాని పేరు అమ్మి. పోనీ మీ సరదా యిట్లాగైనా తీర్చుకోండి.


I.T.L

గ్రైప్ సిరప్

అమ్లపిత్తహరము, ఉదరవాయు హరము, నిరపాయకరము

ఆదంటే పాపాయిలకు బలే ప్రీతి

ప్రతి తల్లీ ఒక సీసా అందుబాటుగా ఉంచుకోవాలి

తయారుచేయువారు :

ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబొరేటరీ లిమిటెడ్,

మల్లేశ్వరం, బెంగుళూరు.




సేల్సుడిపో: నెం. 35/37, తంబుచెట్టివీధి, మదరాసు-1.

SZ 26 TG

రాత్రి పడుకున్నప్పుడు కూడా మాటల సందర్భంలో ప్రతి దఫా మజ్జిగపులుసు, డైరీ, ఆముక్కలు, మెడల్సు యివే తలుచుకుంటూ, వర్ణిస్తు పడుకున్నాడు.

రోజూకంటే కొంచెం ముందుగానే లేచి రకరకాల కూరలన్నీ తరిగింది. కాఫీ త్రాగేసి నిమ్మి భర్త (పులుసురాయుడు) పైకివెళ్ళాడు. పులుసు బాగా మరగాలి గదా అని ముందే అది పొయ్యిమీద ఎక్కించేసింది. ఇంతలో గుటకలు వేస్తూ, నోరు చప్పరిస్తూ, రోడ్డుమీంచే గొప్ప వాసనవేస్తోందే మన మజ్జిగపులుసు అని అనుకుంటూ దిగబడ్డాడు భర్త. వాకిట్లో నవ్వుతూ నిలబడింది నిమ్మి. ఆ నవ్వుకు అర్థం తెలియక భర్తకూడా నవ్వేశాడు.

నవ్వినట్లు కాదు. మజ్జిగపులుసు మరిగించడం నావంతు. అది దించుకొని కడుపులో పోసుకునేది మీవంతు అంది నిమ్మి.

చచ్చానురా దేముడా అని గబగబ లోపలకు పరుగెత్తాడు వంటింట్లోకి. పొంగిపొయ్యిలోకే సగం పైగా పడిపోయింది. మిగిలిన కాస్త మరిగి మరిగి మాడు వాసనతో కొంచెం మిగిలింది. ముక్కలంటే ఎంత సరదా పడ్డాడో ఆరకరకాల ముక్కలన్నీ రూపు లేకుండా ముద్దైపోయాయి.

ఎంతో ఆశపడినందుకు, నిరాశ ఎదురైనందుకు చాలా దుఃఖపడ్డాడు. పులుసు దింపేదాకా అయినా ఆపుకోకుండా ఏం మునిగిపోయినట్లు మూల కూర్చున్నావని, నిమ్మినిచూస్తూ దులిపేశాడు. ఆఫీసుకు టైం అయిపోతోంది. మిగతావంట ఏమీ కాలేదు. బాగా మరిగి మిగిలిన ఆ కాస్త మజ్జిగపులుసు ప్లేటులో పోసుకొని, నిమ్మి కెదురుగా కూర్చుని త్రాగేశాడు. హోటేలునుంచి కారియర్ పంపే ఏర్పాటుచేస్తాను. మరెప్పుడు మజ్జిగ పులుసు సందర్భంలో యిట్లాంటి పాటింపులు పెట్టుకుని, పులుసు పాడుచెయ్యవద్దని, అంతగా అవసరం అయితే పులుసు దించేసిన తర్వాతే మూలకూర్చోమని ధైర్యం చెప్పి ఆఫీసు వెళ్ళిపోయాడు.

హోటేలునుంచి కారియర్ పన్నెండు గంటలకు వచ్చింది. దాని వెనకాలే చిన్నికూడా వచ్చింది. అమ్మగార్ని బైటచూడగానే యివాళ పులుసువట్టిదే అనుకుంది. అయినా అనుమానం తీరక "బాబుగారు మజ్జిగ పులుసు యిస్తామన్నారండీ" అంది. అన్నారా? నీవు అడిగావా? నీ పేరేమిటే? నా పేరు 'చిన్ని' అంటారండి. రాత్రి నా దగ్గిర కూరలుకొంటూ మాయింట్లో మజ్జిగ పులుసు మా నిమ్మి బాగా తయారుచేస్తుందని చెప్పారండి. అయితే నాకొంచెం యిప్పించండి అని నేనే అన్నానండి.

ఇదంతా నాకు చెప్పారులే. నీ కోసమని కూడా కొంచెం హెచ్చే చేశాను. పొయ్యిమీద పెట్టడం ఏమిటి, నేను బైటపడ్డం ఏమిటి. ఇదంతా మజ్జిగపులుసు తగలబడ్డానికి వచ్చింది. సోమవారం యిట్లాంటప్పుడేరా. వచ్చేటప్పుడు అన్నిరకాల కూరలు పట్టుకురా. నిమ్మితాలూకు మజ్జిగపులుసు మజా చూపిస్తా.

అయితే సోమవారం ఏడుగంటలకే కూరలు పంపుతాలెండి మరీ మంచిది. వెళ్లు.

